సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 3 । మే । 2023



'కొలువు'దీరిన చదువు

కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో 'ఉద్యోగ విజయోత్సవం' పేరిట ఉద్యోగం పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరించారు. 8లో



రూ.2.50 లక్షల విరాళం

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ స్లాబ్ పునర్నిర్మాణానికి సీహెచ్ రమేష్‌దత్, తిరుమలదేవి దంపతులు (ఏలూరు), వారి కుమారుడు శ్రీనివాసరావు మంగళవారం రూ.2.50 లక్షల విరాళం సమర్పించారు.

రావణ వాహనంపై సత్యదేవుడు



కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం రాత్రి సత్యదేవుడు, అమ్మవారు రావణ బ్రహ్మ వాహనంపై దర్శనమిచ్చారు. 8లో

రేటు.. నాఫెడ్ రూటు

- పడిపోయిన కొబ్బరి ధరలు
- కొనుగోలు కేంద్రాల కోసం డిమాండ్
- గిట్టుబాటు కాక గతంలో నాఫెడ్ కేంద్రాల్లో విక్రయించని రైతులు
- అధికారుల్లో నిరాసక్తత
- ఏర్పాటు చేస్తే మార్కెట్‌లో ధర పెరుగుతుందని రైతుల ఆశ
- నాలుగైదు రోజుల్లో అనుమతులు!



నాఫెడ్ కేంద్రాల్లో ఎండు కొబ్బరి కొనుగోలు (ఫైల్)

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి దిగుబడికి, ధరలు పెరిగేందుకు ఇది మంచికాలం. కానీ జిల్లాలో కొబ్బరి దిగుబడి, అంబాజీపేట మార్కెట్‌లో ధరలు మాత్రం పెరగడం లేదు. గడచిన ఐదారు నెలలుగా కొబ్బరి కాయ ధరల్లో పెద్దగా పెరుగుదల లేదు సరికదా.. రెండు నెలలుగా మరింత తగ్గాయి. పచ్చికొబ్బరి, తయారీ కొబ్బరి, కురిడీ కొబ్బరి.. ఇలా ప్రతి రకం ధర మార్కెట్‌లో తక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారు నేషనల్ అగ్రికల్చర్ కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) కేంద్రాలు తెరవాలనే డిమాండ్ రైతుల నుంచి వస్తోంది.

జిల్లావ్యాప్తంగా 1,10,732 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. మరో 25 వేల ఎకరాలకు సరిపడా కొబ్బరి చెట్లు ఇళ్లు, కాలువలు, రోడ్ల వెంబడి ఉన్నాయని అంచనా. ఏటా సగటున 81.43 కోట్ల కొబ్బరి కాయ దిగుబడి వస్తోంది. కొబ్బరి ధర తగ్గిన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నాఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు చేస్తాయి. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసిన తొలినాళ్లలో కొనుగోళ్లు జోరుగా జరిగేవి. అయితే గత నాలుగు పర్యాయాలు వీటిని ఇక్కడ ప్రారంభించినప్పుడు కొనుగోళ్లు పెద్దగా జరగలేదు. గత రెండు పర్యాయాలూ ఒక క్వింటాల్ ఎండు కొబ్బరి సైతం కొనుగోలు చేయలేకపోయారు. వేసవి ముగిశాక ప్రారంభించడం, బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో రైతులు అమ్మకాలు చేయలేదు. ఈ కారణంగా ఈసారి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై నాఫెడ్ అధికారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

కానీ రైతుల నుంచి వస్తున్న డిమాండ్ దృష్ట్యా కేంద్రాలను తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. కోనసీమలో ఎంత కొబ్బరి కొనుగోలు చేయవచ్చనే అంశంపై ఉద్యాన శాఖ నుంచి నాఫెడ్‌కు ప్రతిపాదనలు వెళ్లాయి. నాలుగైదు రోజుల్లో నాఫెడ్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే అవకాశమున్నందున తొందరలోనే కేంద్రాలు తెరిచే అవకాశముంది.

గతంతో పోలిస్తే అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో కొబ్బరి ధరలు పతనమయ్యాయి.

ప్రస్తుత ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

కొత్త (తయారీ) కొబ్బరి	8,500
కురిడీ పాతకాయ గండేరా	12,000
గటగట	10,000
కొత్తకాయ గండేరా	11,000
గటగట	9,500

కొబ్బరి కాయలు (వెయ్యికి)

పాత ముక్కుడు కాయ	7,000 – 7,500
నీటికాయ (పచ్చి కాయ)	6,500 – 7,000

నాలుగైదు రోజుల్లో అనుమతి

నాఫెడ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి నాలుగైదు రోజుల్లో అనుమతి వచ్చే అవకాశముంది. అయితే మాకు సిబ్బంది కొరత ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానిక మార్కెట్ యార్డు సిబ్బంది సహకారం తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. వారి నిర్ణయం తరువాత కేంద్రాలను తెరుస్తాం.

– యు.సుధాకరరావు, నాఫెడ్ మేనేజర్, విజయవాడ

గిట్టుబాటు స్వల్పమే..

- ప్రస్తుతం క్వింటాల్ తయారీ కొబ్బరి ధర రూ.8,500. నాఫెడ్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ఎండు కొబ్బరికి కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.10,590. అంటే వాస్తవంగా క్వింటాల్‌కు రూ.2 వేల వరకూ అదనంగా వస్తుంది. కానీ తయారీ కొబ్బరిని స్థానికంగా తయారు చేయాల్సి వస్తే అయ్యే ఖర్చు రూ.10,390. అంటే క్వింటాల్‌కు మిగిలేది రూ.200 మాత్రమే.
- ప్రస్తుతం వ్యాపారులు తయారు చేస్తున్న ఎండు కొబ్బరంతా దేవాలయాల నుంచి సేకరిస్తున్న చిప్పల నుంచి తయారు చేస్తున్నదే. దీనివల్ల దీని ధర తక్కువగా ఉంది. ఈ చిప్పలను ఆలయాల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో ఉత్పత్తి వ్యయం తక్కువ అవుతోంది. ఇతర ప్రాంతాల్లో రైతులు, వ్యాపారులు తయారు చేయాలంటే ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది.
- క్వింటాల్ ఎండు కొబ్బరి తయారీకి కనీసం 1,100 కాయలు ఉండాలి. ప్రస్తుతం మార్కెట్‌లో కొబ్బరి కాయ ధర సగటున రూ.7.20 చొప్పున క్వింటాల్ ఎండు కొబ్బరి తయారీకి రూ.7,900 అవుతుంది. రవాణా, ఎగుమతి, దిగుబడి ఖర్చులు మరో రూ.2,500 కలిపి క్వింటాల్‌కు మొత్తం రూ.10,400 వ్యయమవుతుంది. అంటే క్వింటాల్‌కు మిగిలేది రూ.190 మాత్రమే.
- ఏటా ఇదే పరిస్థితి. దీని వల్ల నాఫెడ్ కేంద్రాల వద్దకు వెళ్లి, ఎండు కొబ్బరి అమ్మేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి. అయినప్పటికీ ఈ కేంద్రాలు తెరిస్తే బహిరంగ మార్కెట్‌లో ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. అందువల్లనే నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
- అయితే ఈ కేంద్రాల ఏర్పాటు వల్ల ఖర్చులు తప్ప కొనుగోలు ఉండటం లేదని నాఫెడ్ అధికారులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు సిబ్బంది కొరత వారిని పీడిస్తోంది. దీంతో కేంద్రాలకు అనుమతి వచ్చినా వెంటనే తెరిచే అవకాశం కనిపించడం లేదు.

న్యూస్‌రీల్

వెంటాడుతున్న వరుణుడు

సాక్షి, అమలాపురం: విదర్భ నుంచి తెలంగాణ, కర్ణాటక మీదుగా ఉత్తర తమిళనాడు వరకూ కొనసాగుతున్న ద్రోణి ప్రభవంతో సోమవారం కురిసిన భారీ వర్షం నుంచి రైతులు ఇంకా తేరుకోలేదు. మంగళవారం ఆకాశం అడపాదడపా మేఘావృతమై రైతులను కలవరానికి గురి చేసింది. తాజాగా బుధ, గురువారాల్లో కూడా ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు వారిని మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకూ జిల్లాలో 31.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఐ.పోలవరంలో 92.2, అత్యల్పంగా మలికిపురంలో 0.2 మిల్లీమీటర్లు నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో.. ముమ్మిడివరం 85.4, అంబాజీపేట 44.6, కె.గంగవరం 44, కాట్రేనికోన 48.2, రాయవరం 38.6, రాజోలు 34, రామచంద్రపురం 33, అయినవిల్లి 31.8, మండపేట 31, అమలాపురం 29.2, కొత్తపేట 27.2 ఆత్రేయపురం 26.8 ఆలమూరు 23.2, రావులపాలెం 21.6, కపిలేశ్వరపురం 19.2, పి.గన్నవరం 18.6, మామిడికుదురు 16.2, ఉప్పలగుప్తం 12.8, అల్లవరం 12.6, సఖినేటిపల్లి 11.2.

స్త్రీనిధి బ్యాంకులో ఇకపై ఆటో డెబిట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏజీఎం ప్రసన్నలక్ష్మి

మలికిపురం: స్త్రీనిధి బ్యాంకులో ఇకపై ఆటో డెబిట్ అవకాశం అందుబాటులో ఉంటుందని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) డి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. మలికిపురంలోని వెలుగు కార్యాలయంలో వీఓఏలకు ఆటో డెబిట్ ఆప్షన్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ, జూలై నుంచి మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాల వాయిదాలు నేరుగా స్త్రీనిధి ఖాతాలకు జమ అవుతాయని చెప్పారు. ఈలోగా సంఘాలకు ఉన్న అప్పులు, నిల్వల్లో తేడాలను గ్రామ సంఘాల్లోని సభ్యులు సరి చూసుకోవాలని అన్నారు. ఈ విధానంలో ఒకరి సొమ్ము వేరొకరికి వెళ్లే అవకాశం ఎంత మాత్రం ఉండదని చెప్పారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.రామినాయుడు మాట్లాడుతూ, సంఘాల అనుమతితో ఆటో డెబిట్ అనుసంధానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం డి.వరాలబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు జి.సుమలత తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: ప్రముఖ బహుళజాతి సంస్థ పానసోనిక్‌లో ఉద్యోగాల భర్తీకి ఐటీఐ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020, 21, 22 సంవత్సరాల్లో ఐటీఐ పాసై 18 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు దీనికి అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల జీతం, షిఫ్ట్ అలవెన్సు ఉంటాయి. అభ్యర్థులకు ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని తమ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని లోక్‌మాన్ తెలిపారు. వివరాలకు 95814 22339 నంబరులో సంప్రదించాలని సూచించారు.

10న నమూనా ఎంసెట్

అమలాపురం టౌన్: ఈ నెల పదో తేదీన జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో నమూనా ఎంసెట్ నిర్వహిస్తున్నట్టు ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి కంటేపల్లి నరేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏబీవీపీ కార్యాయంలో మంగవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.25 వేలు (ప్రథమ), రూ.15 వేలు (ద్వితీయ), రూ.10 వేల (తృతీయ) చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని వివరించారు. జిల్లాలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనుల్లో బయటపడిన శివలింగం



చెరువులో బయట పడిన శివలింగం

గోకవరం: పెంటపల్లి శివారున మర్రివాని చెరువులో మంగళవారం ఉపాధి కూలీలు మట్టి పనులు చేస్తుండగా శివలింగం బయట పడింది. గునపం దెబ్బకు కంగుమన్న శబ్దంతో రాయి తగలడంతో కూలీలు చుట్టూ మట్టి తవ్వి దానిని వెలికి తీశారు. శివలింగం బయటపడటంతో చెరువు నీటితో శుభ్రం చేశారు. శివలింగంపై పాదముద్రలు గుర్తించిన గ్రామస్తులు ఇది రెడ్డి రాజుల కాలం నాటిదని భావిస్తున్నారు.

న్యాయం గెలిచింది



విష్ణుమూర్తిని సత్కరిస్తున్న కాపు నాయకులు

- రైలు దహనం కేసులో అన్యాయంగా ఇరికించారు
- రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు విష్ణుమూర్తి

అమలాపురం టౌన్: తుని రైలు దహనం కేసులో న్యాయమే గెలిచిందని రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి అన్నారు. పట్టణంలోని కాపు నాయకుడు బీఆర్‌కే నాయుడు నివాసంలో మంగళవారం జరిగిన కాపు నేతల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కేసు కొట్టివేతపై ఈ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. విష్ణుమూర్తి మాట్లాడుతూ, కాపు రిజర్వేషన్ల సాధన కోసం తమ సంఘీయులు తుని సభకు వెళ్తే, కొన్ని దుష్టశక్తులు చేసిన రైలు దహనం కేసులో అప్పటి ప్రభుత్వం తమను అన్యాయంగా ఇరికించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 41 మంది కాపు ఉద్యమ నేతలపై అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. విజయవాడ రైల్వే కోర్టు వాస్తవాలను విచారించి, న్యాయమే గెలిచేలా చివరకు తీర్పు చెప్పిందని అన్నారు. ఈ కేసు కొట్టివేతతో కాపు ఉద్యమంలో ఉన్న నిబద్ధత, నిజాయితీ తేటతెల్లమయ్యాయని చెప్పారు. కాపులకు రిజర్వేషన్లు సాధించే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. అనంతరం కాపు నాయకులు విష్ణుమూర్తిని సత్కరించారు. కాపు నాయకులు వంటెద్దు బాబీ, రంకిరెడ్డి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లకు ఈ-కేవైసీ తప్పనిసరి

ముమ్మిడివరం: ప్రభుత్వ పెన్షనర్లు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా ఖజానా లెక్కల అధికారి బి.రామనాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ఖజానా కార్యాలయాల వద్ద ఈ-కేవైసీ చేయించుకొనే వెసులుబాటు ఉందన్నారు. జిల్లాలోని అన్ని ఉప ఖజానా కార్యాలయాల ద్వారా పింఛన్ తీసుకునే వారు ఈ-కేవైసీ చేయించుకోవాలని, సందేహాలుంటే సంబంధిత ఉప ఖజానా కార్యాలయానికి వెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

అన్నదాతకు దన్నుగా..

- కష్టకాలంలో ఆపన్న హస్తం
- ముంపు పొలాల్లో ఉపాధి కూలీలతో పనులు



మండపేట మండలం పాలతోడులో చేల నుంచి ముంపు నీరు దిగేందుకు బోదెలు వేస్తున్న ఉపాధి కూలీలు

సాక్షి, అమలాపురం: రబీ కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో సోమవారం కురిసిన వర్షం డెల్టా రైతులను దెబ్బ తీసింది. పనల మీద ఉన్న చేలు నీట మునిగిపోవడంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు. వారిని గట్టెక్కించేందుకు జిల్లా యంత్రాంగం తక్షణం స్పందించింది. కష్టకాలంలో ఉన్న రైతుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో దెబ్బతిన్న పనలను ఒబ్బిడి చేయడం, చేలల్లో నీరు నిల్వ ఉండకుండా ఉపాధి కూలీల సాయంతో చర్యలు తీసుకుంది. రైతులు పంట నష్టపోకుండా అవసరమైన పనులను ఉపాధి కూలీలతో చేయించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. దీంతో జిల్లాలోని పలు మండలాల్లో తడిసిన పనలను గట్ల మీదకు తీసుకురావడం, కళ్లాల నుంచి, పొలాల నుంచి ముంపు నీరు దిగేలా బోదెలు వేయడం వంటి పనులను ఉపాధి వేతనదారులు స్వచ్ఛందంగా చేపట్టారు. అనువైనచోట్ల వరి కోతలు కోశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యాన మంగళవారం ఒక్క రోజే 709 కాలువ పనులను 33,419 మంది ఉపాధి కూలీలు చేపట్టారు.



కె.గంగవరం మండలం అద్దంపల్లిలో మురుగునీటి కాలువను శుభ్రం చేస్తూ..



కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో ధాన్యం రాశుల చుట్టూ నిలిచిపోయిన వాన నీటికి బోదెల తవ్వకం

వసూళ్ల వర్షం

- మున్సిపాలిటీల్లో 5 శాతం పన్ను రాయితీకి ముగిసిన గడువు
- ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్ పన్ను వసూళ్లు రూ.51.74 కోట్లు
- చివరి ఐదు రోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.23.11 కోట్ల రాబడి
- గత ఏడాది ఏప్రిల్ కంటే ఈసారి రూ.5.23 కోట్ల అదనపు ఆదాయం

కొవ్వూరు: ఐదు శాతం పన్ను రాయితీని వినియోగించుకునేందుకు మున్సిపల్ వాసులు క్యూ కట్టారు. చివరి ఐదు రోజులూ రికార్డు స్థాయిలో పన్నులు వసూలు కావడమే ఇందుకు నిదర్శనం. గడచిన ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెలాఖరు లోపు మొత్తం ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి గడువు గత నెల 30తో ముగిసింది. ఈ ఆఫర్‌కు కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ మూడు జిల్లాల్లో గత నెల 1 నుంచి 24వ తేదీ వరకూ రూ.28.63 కోట్ల పన్నులు వసూలవగా.. ఆ తరువాత చివరి ఐదు రోజుల్లో రికార్డు స్థాయిలో రూ.23.11 కోట్ల మేర వసూలు కావడం గమనార్హం. 2021–22 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో 5 శాతం రాయితీతో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని మున్సిపల్ పట్టణ ప్రజలు రూ.46.51 కోట్ల మేర పన్నులు చెల్లించారు. ఈ ఏడాది రూ.5.23 కోట్లు అదనంగా వసూలై, రూ.51.74 కోట్లకు చేరింది. ఈ మూడు జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.283.58 కోట్ల మేర పన్నులు వసూలు కావాల్సి ఉంది. ఇందులో 18.24 శాతం ఐదు శాతం రాయితీ కారణంగా కేవలం నెల రోజుల వ్యవధిలోనే వసూలైంది. తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా 19.91 శాతం, కాకినాడ జిల్లాలో 19.02 శాతం మేర పన్నులు వసూలు కాగా, కోనసీమ జిల్లాలో మాత్రం అత్యల్పంగా 7.87 శాతం మాత్రమే వసూలు జరిగింది.

రాయితీకి విశేష స్పందన



ఏప్రిల్‌లో ఇచ్చిన 5 శాతం పన్ను రాయితీకి స్పందన బాగుంది. చివరి ఐదు రోజుల్లో రికార్డు స్థాయిలో పన్నులు చెల్లించారు. గత ఏడాది కంటే పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయి. పన్ను రాయితీపై విస్తృత ప్రచారం నిర్వహించడంతో మంచి ఫలితాలు వచ్చాయి.

– ఎన్‌వీవీ సత్యనారాయణ, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, రాజమహేంద్రవరం

ఏప్రిల్‌లో 5 శాతం పన్ను రాయితీతో వసూలైన పన్నులు (రూ.కోట్లలో)

జిల్లా	అసెస్‌మెంట్లు	మొత్తం పన్ను	గత ఏడాది వసూలు	ఈ ఏడాది వసూలు	వ్యత్యాసం
తూర్పు గోదావరి	1,05,503	121.37	20.08	24.17	4.09
కాకినాడ	1,53,403	132.75	21.43	25.25	3.82
కోనసీమ	49,336	29.46	5.00	2.32	– 2.68

రైతులకు సత్వర సేవలు అందించాలి

- మంత్రి చెల్లుబోయిన వేణు
- అంబాజీపేట సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం




సభలో మాట్లాడుతున్న మంత్రి వేణు. చిత్రంలో ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

అంబాజీపేట: సహకార సంఘాల ద్వారా రైతులకు సత్వర సేవలు అందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. అంబాజీపేట సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. త్రిసభ్య కమిటీ నూతన చైర్మన్‌గా దొమ్మేటి సత్యమోహన్, సభ్యులుగా నందెపు సూరిబాబు, గోసంగి గంగిశెట్టితో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. సొసైటీ మాజీ చైర్మన్ కొర్లపాటి కోటబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సొసైటీకి వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా రైతుల పనులు పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎంతో న్యాయం చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ, పార్టీకి అంకిత భావంతో సేవలందించిన వారికి వారి శక్తిసామర్థ్యాలను బట్టి పదవులు లభిస్తాయని అన్నారు.

నియోజకవర్గంలోని 26 సొసైటీల చైర్మన్ పదవుల్లో ఐదు కాపు, ఐదు క్షత్రియ, 10 బీసీ, ఒక ఎస్సీ, ఒక వైశ్య సామాజిక వర్గాలకు కేటాయించామని తెలిపారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ, రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలూ పాటుపడుతున్నారని, రైతుల ఖాతాల్లోనే వారికి చేకూర్చే లబ్ధిని జమ చేస్తున్నారని అన్నారు. మేజర్, మైనర్ డ్రెయిన్‌ల ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మరో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, రైతు సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ, రైతులకు మెరుగైన సేవలందిస్తూ సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టిబాబును, సొసైటీ చైర్మన్ సత్యమోహన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పేరి శ్రీనివాస్, చెల్లుబోయిన శ్రీనివాస్, వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు, విత్తనాల శేఖర్, నేతల నాగరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంఎం శెట్టి, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ రాముకు విశిష్ట బహుమతి



మాడా రాము, కార్టూనిస్ట్

అమలాపురం రూరల్: బండార్లంక గ్రామానికి చెందిన కార్టూనిస్ట్ మాడా రాము గీసిన వ్యంగ్య చిత్రం విశిష్ట బహుమతికి ఎంపికైంది. మొదటి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు తలిశెట్టి రామారావు జయంతిని పురస్కరించుకుని, ఆయన పేరిట తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా హాస్యానందం మాస పత్రిక కార్టూన్ల పోటీ–2023 నిర్వహించింది. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 400 కార్టూన్లు వచ్చాయి. వీటిలో 25 ఎంపిక చేయగా, రాము కార్టూన్ వాటిలో నిలిచింది. ఈ నెల 20న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరగనున్న సభలో రాము బహుమతి అందుకోనున్నారు.



విశిష్ట బహుమతికి ఎంపికైన రాము కార్టూన్

క్లుప్తంగా

'వందేభారత్'పై రాళ్ల దాడి కేసులో ముగ్గురి అరెస్టు



రాళ్ల దాడికి పాల్పడిన మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించిన ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య తదితరులు

రాజమహేంద్రవరం సిటీ/సామర్లకోట: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లతో దాడికి పాల్పడిన వారిలో ముగ్గురిని రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.సైదయ్య కథనం ప్రకారం.. విశాఖపట్నం – సికింద్రాబాద్ వందేభారత్ రైలు(20833)పై గత నెల 28న పిఠాపురం – సామర్లకోట మధ్య రాళ్లతో దాడి జరిగింది. దీనిపై ఆర్పీఎఫ్‌తో పాటు ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ), సీఐబీ అధికారులు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన ఆరుగురిని ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. సామర్లకోటకు చెందిన బొడ్డు రాజు, సప్పా దుర్గ, కోట రవి, మరో ముగ్గురు బాలురు రైల్వే ట్రాక్ పక్కనే ఉండి ఈ దాడికి పాల్పడ్డారని నిర్ధారించారు. ప్రయాణికులను భయపెట్టేందుకు వీరు ఈ దాడికి పాల్పడగా జీ–1 బోగీ కిటికీ అద్దాలు పగిలిపోయాయి. నిందితులు తమ నేరాన్ని అంగీకరించారని సైదయ్య తెలిపారు. ఈ దాడిలో మేజర్లు అయిన ముగ్గురినీ అరెస్టు చేసి, విజయవాడ రైల్వే కోర్టులో మంగళవారం హాజరు పరచి, రిమాండుకు తరలించారు. మైనర్లయిన మిగిలిన ముగ్గురినీ స్థానిక జువైనల్ హోమ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో కాకినాడ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ డి.రామారావు, ఎస్సై బి.లోవరాజు, ఏఎస్సై పి.సత్యనారాయణ, సిబ్బంది కీలక పాత్ర పోషించారని సైదయ్య చెప్పారు. రైల్వే ఆస్తులకు ఎవరైనా నష్టం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవనం పనులు చేస్తున్న సుభాష్ షేక్ (53) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఒడిశాకు చెందిన సుభాష్ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులకు రాజమహేంద్రవరం వచ్చాడు. మధ్యాహ్నం పనిలో ఉండగా ఛాతిలో నొప్పి వస్తోందంటూ కుప్పకూలిపోయాడు. అక్కడి వారు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సుభాష్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. త్రీటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కొలువు'దీరిన చదువు

- 215 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు
- అట్టహాసంగా ఉద్యోగ విజయోత్సవం



ఉద్యోగం పొందిన విద్యార్థిని, తల్లిని సత్కరిస్తున్న ఎంపీ వంగా గీత, విద్యాశాఖ కమిషనర్ నాగరాణి. చిత్రంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చదువు పూర్తయ్యాక ఏ విద్యార్థీ ఉపాధి కోసం ఇబ్బంది పడకూడదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష ఇది. ఇందుకు అనుగుణంగా మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో ఆయన ప్రభుత్వం వివిధ మార్పులు తీసుకు వచ్చింది. ముఖ్యంగా నైపుణ్యంపై బాగా ఫోకస్ పెట్టింది. దీంతో విద్యార్థులను వెతుక్కుంటూ కంపెనీలే రావడం మొదలైంది. పాలిటెక్నిక్ కళాశాలకూ ఇది విస్తరించింది. పదో తరగతి పూర్తయిన తరువాత పాలిటెక్నిక్ మూడేళ్లు చదవగానే సామర్థ్యాన్ని బట్టి ఉద్యోగం లభించేలా ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ ఇందుకు దోహదపడింది. 'ఉద్యోగ విజయోత్సవం' పేరిట మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా నిలిచింది. ఉద్యోగం పొందిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సత్కరించే కొత్త సంప్రదాయానికి నాంది పలికింది. కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ బ్రాంచిలకు చెందిన 215 మంది తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారు. వీరందరూ రూ.1.80 వేల నుంచి రూ.3 లక్షల వరకూ వార్షిక ఆదాయమున్న ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగ విజయోత్సవంలో ఎంపీ వంగా గీత, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కాడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ప్రిన్సిపాల్ జనార్దనరావు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు.

ఉద్యోగ విజయోత్సవం బాగుంది



కళాశాలలో మొదటిసారిగా ఉద్యోగ విజయోత్సవం పేరుతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా జూనియర్ విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయి. మంచి స్కిల్స్ పెంపొందించుకుని ఉద్యోగాలు సాధించాలనే అభిప్రాయం వారికి ఏర్పడుతుంది. డీవీ టెక్నాలజీలో రూ.2.70 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించాను.

– పూర్ణచంద్ర రెల్లి

ఆనందంగా ఉంది



సివిల్ విభాగంలో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. తొలి ప్రయత్నంలోనే ఎస్‌డీవీఏఎల్ సంస్థలో రూ.1.50 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. జగనన్న విద్యాదీవెన వంటి పథకలతో పాటు ఉద్యోగాలు సాధించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఆనందంగా ఉంది.

– ఎ.యార్ణమ్మ

రూ.3 లక్షల ప్యాకేజీతో..



మేధా సర్వో డ్రైవ్ రూ.3 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం ఆఫర్ చేసింది. ప్రభుత్వ కళాశాలకు ప్రైవేటు సంస్థలు వచ్చి ఉద్యోగాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. పాలిటెక్నిక్‌లో ఈసీఈ బ్రాంచి ఆఖరి సంవత్సరం చదువుతున్నాను.

– కె.నిషిత

సీఎం పర్యటన 24కు వాయిదా

- భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం
- హోం మంత్రి వనిత వెల్లడి



కొవ్వూరు: భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఈ నెల 24వ తేదీకి వాయిదా పడింది. కొవ్వూరులోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ల సేవలను గుర్తించి, సత్కరించి, నగదు పురస్కారాలు అందించేందుకు 'వలంటీర్లకు వందనం' పేరుతో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని బుధవారం కొవ్వూరులో నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. ఇందులో సీఎం జగన్ పాల్గొని, బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉంది. అయితే, వర్షాల కారణంగా ఏర్పడిన ప్రతికూల వాతావరణంతో సీఎం పర్యటన ఏర్పాట్లకు ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడిందని మంత్రి తెలిపారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం ఈ నెల 24న కొవ్వూరులోనే జరుగుతుందని చెప్పారు.

రావణ వాహనంపై సత్యదేవుడు

- అన్నవరంలో ఘనంగా ఊరేగింపు
- తరలివచ్చిన భక్తులు, గ్రామస్తులు



రావణబ్రహ్మ వాహనంపై సాగుతున్న సత్యదేవుడు, అమ్మవార్ల ఊరేగింపు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లు రావణబ్రహ్మ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రాత్రి 9 గంటలకు ఊరేగింపుగా కొండ దిగువన తొలి పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సర్వాంగసుందరంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవార్లను పండితులు వేంచేయించి పూజలు చేశారు. అనంతరం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. తొలి పావంచా నుంచి ఆంధ్రా బ్యాంక్ సెంటర్ వరకూ, అక్కడి నుంచి మళ్లీ తొలి పావంచా వరకూ ఊరేగింపు సాగింది. సత్యదేవుని వాహన సేవల్లో అతి పెద్దది రావణబ్రహ్మ వాహనం. దీంతో ఈ ఊరేగింపును చూసేందుకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు తరలివచ్చారు. ఊరేగింపు సాగినంతసేపూ బాణసంచా కాల్చారు. పలువురు కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు. ఊరేగింపు సందర్భంగా అన్నవరం గ్రామంలోకి భారీ వాహనాలను అనుమతించలేదు. ఎస్సై శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

కాగా, స్వామివారి కల్యాణోత్సవాలకు వర్షంతో ఆటంకం కలగకుండా ఉండేందుకు దేవస్థానం పండితులు సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. యంత్రాలయంలో సూర్యభగవానుడికి దేవస్థానం ఈఓ అజాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్ద సూర్య భగవానుడికి బూర్లు నివేదించి, ఆకాశంలోకి ఎగురవేశారు. ఈ బూర్లను భక్తులు ప్రసాదంగా స్వీకరించారు. ఏర్పాట్లను ఏఈఓ కృష్ణారావు పర్యవేక్షించారు.

ఘనంగా స్థాలీపాక హోమాలు

అంతకుముందు నవ దంపతులుగా కొలువుదీరిన స్వామి, అమ్మవార్లకు దర్బారు మండపంలో స్థాలీపాక హోమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను తూర్పు రాజగోపురం వద్దకు వేద పండితులు ఊరేగింపుగా తీసుకువచ్చి, అరుంధతీ నక్షత్ర దర్శనం చేయించి, పూజలు చేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు అరుంధతీ నక్షత్ర దర్శనం చేయిస్తున్న పండితులు



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



ఊరేగింపులో ఈఓ చంద్రశేఖర్ అజాద్, అర్చకులు, సిబ్బంది

ఆరుగురు దోపిడీ దొంగల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: రెండు వేర్వేరు చోరీల్లో పట్టుబడిన ఆరుగురు దోపిడీ దొంగల్ని పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఇంద్రపాలెంలోని ఓ ఆయిల్ మిల్లులో పని చేసిన మల్లాది ప్రసాద్ యజమాని ఇంటిపై కన్ను వేశాడు. యజమాని ఇంటి కింది అంతస్తులో మిల్లు ఉండగా పై అంతస్తులో వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వారి నుంచి బంగారం, డబ్బు దోచేయడానికి మరో ఇద్దరితో కలిసి ప్రసాద్ పథకం వేశాడు. ఈ క్రమంలో పాత నేరస్తుడైన జగన్నాథపురం నాగరాజుపేటకు చెందిన డొక్కాడ మహేష్, ఏటిమొగకు చెందిన పెసంగి ప్రసాద్ కలిసి వృద్ధ దంపతుల్ని బెదిరించారు. వారిని తాళ్లతో కట్టేసి 207 గ్రాముల బంగారం, 4.7 కిలోల వెండి, సెల్‌ఫోన్ దొంగిలించి పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసిన ఇంద్రపాలెం పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.9 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

అలాగే, గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ముగ్గురు దోపిడీ దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం కొంతమూరుకు చెందిన మానిపాటి విజయకుమార్, క్వారీ మార్కెట్‌కు చెందిన నదిపూడి మధు, కర్రి మూర్తి కలిసి, కొద్ది రోజుల క్రితం గొల్లప్రోలు వద్ద దారి దోపిడీకి పాల్పడ్డారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పొట్టూరి ధర్మరాజు అనే వ్యక్తిని ఆపారు. అతడిపై దాడి చేసి, కొట్టుకుంటూ సమీపంలోని మామిడి తోటల్లోకి తీసుకువెళ్లారు. అతడి నుంచి రూ.1.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ దొంగిలించారు. ఈ కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన ఇంద్రపాలెం, గొల్లప్రోలు పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆమెది హత్యే

- అదృశ్యమైన వారం తరువాత మహిళ మృతదేహం లభ్యం
- అనుమానాస్పద మృతిగా తొలుత కేసు
- వివాహేతర సంబంధం కలిగిన వ్యక్తే హతమార్చాడని నిర్ధారణ
- నిందితుడి అరెస్టు



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ రమణ

కొత్తపేట: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాము లక్ష్మి హత్యకు గురైందని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. డీఎస్పీ కథనం ప్రకారం.. మండలంలోని వానపల్లి శివారు ఇందిరా నగర్‌కు చెందిన లక్ష్మి గతంలో అదృశ్యమైంది. వారం రోజుల తరువాత గత నెల 22న ఆమె ఇంటికి సమీపంలోని ఒక రైతు మోటారు బావిలో శవమై కనిపించింది. దీనిపై ఆమె భర్త కాసు ఫిర్యాదు మేరకు ఎస్సై వి.మణికుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. డీఎస్పీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఈ కేసు దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మితో వివాహేతర సంబంధం కలిగిన వ్యక్తే ఆమెను హతమార్చాడని నిర్ధారించారు. లక్ష్మితో వాడపాలేనికి చెందిన మీసాల ఏసు పదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆమెకు ఆర్థికంగా సాయం కూడా చేస్తున్నాడు. ఇటీవల ఆమె ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతూ వేరే వాళ్లతో చనువుగా ఉంటోంది.

తన మాట కూడా వినకపోవడంతో ఏసు ఆమెపై అనుమానం పెంచుకుని, చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు గత నెల 15వ తేదీ రాత్రి తన తోటలోని గేదెలపాక వద్దకు ఆమెను పిలిచాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తనతో తెచ్చుకున్న తాడును లక్ష్మి పీకకు బిగించి హతమార్చాడు. అనంతరం తనపై ఎవ్వరికీ అనుమానం రాకుండా లక్ష్మి శవాన్ని తీసుకువెళ్లి సమీపంలోని బండారు గంగరాజు అనే రైతు పొలంలోని మోటారు బావిలో పడేశాడు. బావిపై సిమెంటు ప్లేటు మూసేశాడు. ఏసుపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. లక్ష్మిని తానే హతమార్చినట్టు అంగీకరించాడు. అతడు హత్యకు ఉపయోగించిన తాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఏసును బుధవారం కోర్టులో హాజరు పరచనున్నామని డీఎస్పీ రమణ తెలిపారు. విలేకర్ల సమావేశంలో సీఐ రజనీకుమార్, ఎస్సై మణికుమార్, ఏఎస్సై కృష్ణారావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కేశనపల్లి ఆవు పెయ్యలకు జాతీయ బహుమతులు



బహుమతి పొందిన ఆవు పెయ్యతో లక్ష్మీనారాయణ

మలికిపురం: మండలంలోని కేశనపల్లికి చెందిన ఆవు పెయ్యలు జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు సాధించాయి. ఏలూరు జిల్లా మండవల్లి మండలం కానుకొల్లులో గత శని, ఆది, సోమవారాల్లో అఖిల భారత ఒంగోలు, పుంగనూరు గోజాతితో పాటు 108 దేశీయ గోజాతి ఆవుల పాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కేశనపల్లి వాసి అడబాల లక్ష్మీనారాయణ(నాని)కు చెందిన ఆవు పెయ్య ఒంగోలు జాతి పాల పళ్ల పెయ్యల విభాగంలో ద్వితీయ బహుమతి పొందింది. అలాగే ఆయనకే చెందిన పుంగనూరు ఆవు పుంగనూరు జాతి గోవుల విభాగంలో తృతీయ బహుమతి గెలుచుకుంది. ఏలూరు జిల్లా పశుసంవర్ధక అధికారి జి.నెహ్రూబాబు, నిర్వాహక సంఘం అధ్యక్షుడు పి.సత్యనారాయణ చేతుల మీదుగా లక్ష్మీనారాయణ ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

పాము కాట్లతో ముగ్గురి మృతి

సామర్లకోట/రాజానగరం/అంబాజీపేట: కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పాము కాట్లకు గురై ముగ్గురు మృతి చెందారు. సామర్లకోట మండలం జి.మేడపాడులోని కొత్తూరు రోడ్డులో ఉన్న సీతారామ చెరువులో ఉపాధి కూలీలు మంగళవారం పని చేస్తున్నారు. ఆ సమయంలో పాము కాటు వేయడంతో ఉపాధి కూలీ బలిరెడ్డి వరలక్ష్మి (71) మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే సదుపాయాలు అందిస్తామని ఏపీఓ ప్రభాకర్ తెలిపారు.

తాచుపాము కాటుకు బాలుడి బలి

మరో ఘటనలో రాజానగరం మండలం కలవచర్లలో రెండేళ్ల బాలుడు పాము కాటుతో మృతి చెందాడు. రాజమహేంద్రవరానికి చెందిన దర్శి నాగసాయి తల్లిదండ్రులతో కలసి కలవచర్లలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పెరట్లో ఆడుకుంటున్న సమయంలో తాచుపాము అతడిని కాటు వేసింది. బాధ భరించలేక కెవ్వుమంటూ ఏడవసాగాడు. అతడిని ఏ చీమో కుట్టిందనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు ఆ బాలుడికి కొబ్బరి నూనె రాచి, నిద్రపుచ్చారు. కొంతసేపటికి నోటి నుంచి నురగలు రావడంతో కంగారుపడి పరిసరాలు పరిశీలించారు. కప్పను మింగుతూ కదల్లేకుండా ఉన్న తాచుపాము కనిపించడంతో అది కరిచిందని గ్రహించారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అప్పటికే ఆ బాలుడు మృతి చెందాడని వైద్యాధికారి టి.రవికుమార్ తెలిపారు.

కట్లపాము కరిచి..



పళ్లాలమ్మ (పాతచిత్రం)

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు మార్కెట్‌పాలేనికి చెందిన నేదునూరి పళ్లాలమ్మ(67)ను సోమవారం కట్లపాము కరిచింది. ఆమెను కుటుంబ సభ్యులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పళ్లాలమ్మ మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.